ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

మెగా టౌన్‌షిప్‌లో వేసిన ప్లాట్లు



చత్తీస్‌ఘడ్ బృందం 'ఉపాధి' పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న చత్తీస్‌ఘడ్ బృందం

కురబలకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడు సమీపంలో జరిగిన ఉపాధి హామీ పనులను చత్తీస్‌ఘడ్ పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ రాంధాన శ్రీబాగ్ పరిశీలించారు. గురువారం మండలంలోని ముదివేడు సమీపంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో జరిగిన మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ గోకులం షెడ్స్ కస్తూర్బా బోర్‌వెల్ రీచార్జ్, పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై రైతులకు, గ్రామాల అభివృద్ధికి ఏ విధంగా చేయూతనివ్వాలో పలు అంశాలపై చర్చించి తెలుసుకున్నారు. అనంతరం కురబలకోట సమీపంలోని ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించి చెత్త నుంచి సంపదను ఎలా సృష్టించడం, ఎరువుల తయారీ, తదితర వాటిని బృందం పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చత్తీస్‌ఘడ్ బృందం ప్రతినిధులు శ్యామమీర్, గానవీర్, నరేంద్రయాదవ్, అంకితకుమార్, జగదీశ్వర్, ఎంపీడీవో గంగయ్య, ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఈవోఆర్డీ అశ్విని, ఏపీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

న్యుమోనియా నుంచి చిన్నారులను కాపాడదాం

- డీఆర్‌వో మధుసూదన్‌రావు

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): న్యుమోనియాను అరికట్టి చిన్నారులను కాపాడుదామని డీఆర్‌వో మధుసూదన్‌రావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా ఇమ్యునైజేషన్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించబడిన పోస్టర్‌ను డీఆర్‌వో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ చిన్నపిల్లల్లో న్యుమోనియా రాకుండా చేసేందుకు వారికి తగిన సమయంలో టీకాలు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్‌శాఖ అధికారి ఉషశ్రీ, ఆ శాఖ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి 'సదరం'
స్లాట్ బుకింగ్‌లు ప్రారంభం

కలికిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల వైకల్యం స్థాయిని నిర్ధారించి తదనుగుణంగా సర్టిఫికెట్లను జారీ చేసేందుకు నిర్వహించే పరీక్షల కోసం స్లాట్ బుకింగ్‌లు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దివ్యాంగులు తమ అంగ వైకల్యం వర్గీకరణను బట్టి కేటాయించిన ఆసుపత్రిలో పరీక్షల కోసం హాజరు కావలసి ఉంటుంది. ముందుగా ఏ ఆసుపత్రికి, ఏ తేదీన వెళ్లాలని నిర్ణయించుకుని ఆ మేరకు స్లాట్‌ల బుకింగ్ ద్వారా ఖరారు చేసుకోవచ్చు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో స్లాట్ బుకింగ్‌లు అందుబాటులో ఉంటాయి. సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం నవంబరు, డిసెంబరు నెలల్లో స్లాట్‌లు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ బోధన, జిల్లా ఆసుపత్రుల్లో శారీరక, మానసిక, దృష్టి వైకల్యం, బధిరులకు కేటాయించారు. అదేవిధంగా ప్రాంతీయ వైద్య శాలల్లో కూడా శారీరక, దృష్టి వైకల్యం పరీక్షలు, ఎంపిక చేసిన కొన్ని సీహెచ్‌సీలలో శారీరక వైకల్య పరీక్షలను కేటాయించారు. సామాజిక పింఛన్ల మంజూరుకు, రైలు, బస్సు ప్రయాణాల్లో రాయితీ టికెట్లు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సదరం సర్టిఫికెట్లు అవసరమవుతాయి.

మున్సిపల్ సేవలపై ట్రైనీ కలెక్టర్లకు అవగాహన



మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమీలతో సమావేశమైన ట్రైనీ కలెక్టర్లు

మదనపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశానికి సంబంధించిన ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు గురువారం మదనపల్లెకు వచ్చారు. శిక్షణలో భాగంగా కురబలకోట మండలంలో మూడు రోజుల పర్యటన ముగించుకుని గురువారం మదనపల్లెకు వచ్చారు. స్థానిక సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆధ్వర్యంలో వీరంతా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో వివిధ శాఖల్లో ప్రజలకు అందుతున్న సేవలపై అవగాహన పొందుతున్నారు. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.ప్రమీలతో సమావేశమయ్యారు. ఇక్కడి మున్సిపాలిటీలో ఏయే శాఖలు ఉన్నాయి? ఏయే సేవలు, ఏ విధంగా ప్రజలకు అందిస్తున్నారనే అంశంపై కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాల అధిపతులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని సచివాలయాలు, వీధుల్లో పర్యటించారు. ట్రైనీ కలెక్టర్లు ప్రాటివలమ, హరిప్రసాద్ పొత్తరాజు, అసిశర్మ, విబ్‌హర్ భరద్వాజ్, పాటిల్ కృష్ణ బద్రువాన్, ఆనంద్ ప్యారిల్ ఉన్నారు.

కాలువలు ఆక్రమించి...
మెగా టౌన్‌షిప్



రాజంపేట మున్సిపల్ పరిధిలో వైసీపీ నేతలు వేసిన మెగా టౌన్‌షిప్

- వైసీపీ నేతల దందా
- అనుమతులు లేకుండా వ్యవసాయ భూముల్లో ప్లాట్లు
- నోటీసులు జారీ చేసిన మున్సిపల్ కమిషనర్



పంట పొలాలకు వెళ్లే కాలువపైన వేసిన రోడ్డు

రాజంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో 50 ఎకరాలకు పైబడి వ్యవసాయ భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేయడమే కాకుండా కాలువలను ఆక్రమించేసిన పెద్ద ఎత్తున రోడ్లు వేశారు. పంట పొలాల నడిబొడ్డున కాలువలపై రోడ్లు వేసి కొందరు వైసీపీ నాయకులు చేసిన దందాపై ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్లాట్లలో ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన ఆన్‌లైన్‌లో లేని మిగులు భూములు కూడా ఉన్నాయని, అంతేగాక ప్రభుత్వ భూమిలో రోడ్లు వేశారని సమాచారం. ఈ విషయం రాజంపేటలో భగ్గుమనడంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, టౌన్ ప్లానింగ్ అధికారి వెంటనే మిత్ర టౌన్‌షిప్‌కు నోటీసులు జారీ చేశారు. మున్సిపాలిటీ మంజూరు చేయని ప్లాట్లను అమ్మకాలు, కొనుగోలు చేయరాదని తెలిపారు. లేఅవుట్‌లో నిర్మాణాలు జరిపితే కూల్చివేస్తామని నోటీసులో పేర్కొన్నారు.



పంట కాలువలపైన వేసిన రోడ్డుపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్

వైసీపీ ప్రభుత్వ హయాంలో మన్నూరు చెరువు కింద ఉస్మాన్ సెగ్మెంట్-2 ఏరియాలో రాజంపేట, పోలి వ్యవసాయ పొలాల్లో ఉమ్మడి జిల్లాలోని ప్రొద్దుటూరు, కడప తదితర ప్రాంతాలకు చెందిన బడా వైసీపీ నాయకులు మెగా టౌన్‌షిప్‌నకు శ్రీకారం చుట్టారు. ఇందులో జగన్ సమీప బంధువులు ప్రధాన షేర్ కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. వీరి ఆధ్వర్యంలో మన్నూరు చెరువు కింద ఉన్న ఈ పొలాలను అతి తక్కువ రేటుతో కొనుగోలు చేశారు. భారీ వర్షాలు పడినపుడు పుల్లంగేరు నుంచి వచ్చే చక్రాలమడుగు నీరు ఈ పొలాలపై ప్రవహిస్తుంది. అక్కడ చౌకగా 50 ఎకరాలు పైబడి కొనుగోలు చేశారు. సుమారు 40 అడుగుల మేర ఒక కిలోమీటరు పైబడి పంట పొలాల కాలువలపై రోడ్లు వేశారు. రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకుండా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉన్న వారి భూములను కూడా ప్లాట్లలో కలిపేసినట్లు తెలుస్తోంది. కొందరు రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మున్సిపల్ చట్టం ప్రకారం లేఅవుట్ వేయాలంటే వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. అభివృద్ధి పనులకు, పార్కులకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైటింగ్, ఇతర అభివృద్ధి పనులకు స్థలాన్ని వదిలి ప్లాట్లు వేసుకోవాలి. ఇవేమి లేకుండా ప్లాట్లు వేశారు. ప్రస్తుతం ఈ లేఅవుట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ప్రారంభించారు. ఈ సర్వే నెంబర్లలో ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ లేకుండా లేఅవుట్‌లోని ఏదోక సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై మిత్ర మెగా టౌన్‌షిప్ ప్రతినిధి చంద్ర ఓబుల్‌రెడ్డిని వివరణ కోరగా తాము అన్ని నిబంధనలు పాటించే మిత్ర మెగా టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేశామన్నారు. రైతుల నుంచి పక్కాగా రిజిస్ట్రేషన్ స్థలాలను కొనుగోలు చేసి ఈ వెంచర్ వేశామని, అందరి ఆమోదంతో కాలువను పూడ్చకుండా వాటిపై రోడ్డు వేసి మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేశామన్నారు.

నోటీసులు జారీ చేశాం



రాజంపేట మున్సిపాలిటీ అనుమతి లేకుండా మిత్ర మెగా టౌన్‌షిప్ డెవలపర్స్ పేరిట 49 ఎకరాల్లో వెంచర్ వేసినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ ఏడాది జనవరి 20న ఈ లేఅవుట్ వేసినట్లు తెలిసింది. వీరు లేఅవుట్ మంజూరు కోసం మున్సిపాలిటీకి అర్జీ పెట్టలేదు. అనుమతులు లేకుండానే ప్లాట్లు అమ్మడం చట్టరీత్యా చెల్లదు. సెక్షన్ 184, 185(1), 360, 360(1) కింద నోటీసులు జారీ చేశాం. ఎవరైనా లేఅవుట్‌లో నిర్మాణాలు చేస్తే కూల్చివేస్తాం.

- శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్, రాజంపేట

మంచు దుప్పట్లో సూరీడు...



వాల్మీకిపురంలో మంచు తెరల చాటున సూర్యుడు

వాల్మీకిపురంలో గురువారం మంచు దుప్పట్లు కమ్మేశాయి. ఉదయం 7.30 గంటలు దాటినా వీడని మంచుతో సూర్యుడు సైతం మంచు తెరల చాటున ఉండిపోయాడు. జాతీయ రహదారులు పొగమంచుతో కమ్ముకుపోగా పట్టణం మొత్తం మంచు దుప్పట్లు వేశాయా అన్నట్లు దృశ్యాలు అబ్బురపరిచాయి. 8 గంటల తర్వాత పొగమంచు తెరల చాటు నుంచి సూర్యుడు బయట పడ్డాడు.

-వాల్మీకిపురం, (ఆంధ్రజ్యోతి)







వాల్మీకిపురంలో కమ్మేసిన మంచు దుప్పట్లు

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో అమర్‌నాథరెడ్డి

తంబళ్లపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో అమర్‌నాథరెడ్డి తెలిపారు. మై స్కూల్, మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంఈవో-2 నాగసుబ్బరాయుడుతో కలసి మోడల్ స్కూల్‌ను డీఎల్‌డీవో తనిఖీ చేశారు. పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంటు, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పదిలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

దాహార్తి తీర్చండి

- గ్రామస్థుల నిరసన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

మదనపల్లె అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం మాలేపాడు గ్రామం కత్తివారిపల్లెలో ప్రజల దాహార్తిని తీర్చాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం గ్రామస్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రెండు నెలలుగా నీళ్లు రావడం లేదని, వ్యవసాయ బోర్ల రైతులు దయతలిస్తే తాగునీళ్లు పట్టుకొంటున్నారని చెప్పారు. వీధి లైట్లు వెలగడం లేదని, రోడ్డు బాగా లేదని, రాత్రిపూట రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు. గ్రామానికి శ్మశానం కోసం స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులకు చెబుతున్నా స్పందించలేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు నాగరాజు, వెంకటలక్ష్మీ, అరుణ, రేణుక, శ్రీనివాసులు, ఆదినారాయణ, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు మరింత పేరు తెస్తాం

- మంత్రి సత్యకుమార్
- అట్టహాసంగా మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, చిత్రంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, రాంప్రసాద్‌రెడ్డి, తదితరులు

మదనపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌కు మరింత పేరు తెస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. స్థానిక టమోటా మార్కెట్‌లో గురువారం మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా జంగాల శివరాం, ఉపాధ్యక్షుడిగా రామిశెట్టి ఆంజనేయులు, ఏడుగురు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఇక్కడి రైతులు, వ్యాపారులకు కావాల్సిన వసతులు, సౌకర్యాలు కల్పిస్తామని, ఇక్కడి నుంచి బయటి రాష్ట్రాల మార్కెట్‌లకు టమోటాలు ఎక్కువగా ఎగుమతులు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ మార్కెట్‌లో జాక్‌పాట్ అంటే రైతులకు లాభం చేకూర్చేలా ఉండే పద్ధతి అనుకున్నా..తీరా చూస్తే రైతులకు నష్టం చేకూరుస్తూ, దళారులు తెచ్చిన ఈ విధానంతో వ్యాపారికి లాభం తెచ్చేదని తెలిసి బాధపడ్డానని చెప్పారు. ఇక్కడి టమోటా రైతులు పడుతున్న ఇబ్బందులను జనసేన నేత గంగారపు రాందాస్‌చౌదరి నా దృష్టికి తేగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు వివరించి 2019 డిసెంబరులో రైతులతో ముఖాముఖి ఏర్పా టు చేశామని, అప్పటి వైసీపీ ప్రభుత్వం తమను మార్కెట్‌కు రాకుండా అడ్డుకుందని, తీవ్రమైన ఆంక్షల నడుమ టమోటా రైతులు పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూశారని, అందుకే మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జనసేన నాయకుడు జంగాల శివరాంను డిప్యూటీ సీఎం ఎంపిక చేసినట్లు తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం మాట్లాడారు. అంతకుముందు మార్కెట్ కార్యదర్శి జగదీశ్ చైర్మన్, వైస్ చైర్మన్ చేత వేర్వేరుగా ప్రమాణ స్వీకారం చేయించగా, సభ్యుల చేత సామూహికంగా ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశంలో జనసేన నేత గంగారపు రాందాస్‌చౌదరి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, విజయభారతి స్కూల్ సేతు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, టీడీపీ నేతలు కోహూరి మల్లికార్జుననాయుడు, రాటకొండ బాబురెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ ఎన్.విద్యాసాగర్, ఎస్.ఎ.మస్తాన్, ఉమ్మడి చిత్తూరు జిల్లాల జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కిడ్నీ ముఠా కేసులో రెండో రోజు విచారణ

- బెంగళూరు, గోవాకు ప్రత్యేక బృందాలు

6

గుంతల రోడ్డులో తిరిగేదెలా...?

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థుల ధర్నా



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

ములకలచెరువు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంతలమైన రోడ్డులో తిరగలేకున్నామని, వెంటనే రోడ్డు మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సెంట్రల్ స్కూల్ గ్రామ పంచాయతీలోని యర్రగుడివారిపల్లె, నల్లచెరువుపల్లి గ్రామస్థులు ధర్నా చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ సెంట్రల్ స్కూల్ నుంచి రంగానాయునిపల్లె, యర్రగుడివారిపల్లె, నల్లచెరువుపల్లె గ్రామాల మట్టి రోడ్డు గుంతలమయమై దుస్థితికి చేరడంతో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్డు సరిగా లేక తమ గ్రామాలకు 108 అంబులెన్సు వచ్చేందుకు కూడా వీలు లేకపోవడంతో ఆస్పత్రులకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నామన్నారు. పిల్లలను స్కూళ్లకు పంపాలన్నా బస్సులు రావడం లేదన్నారు. అనంతరం ఈవోఆర్డీ మోహన్‌ప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు సురేశ్‌కుమార్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, గోపాలమ్మ, పార్వతమ్మ, ధనలక్ష్మి, నారాయణమ్మ, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు మహర్దశ

- ఆకాంక్షిత వ్యవసాయ జిల్లాగా అన్నమయ్య
- ప్రధానమంత్రి ధన-ధాన్య కృషియోజన పథకం కింద ఎంపిక
- ఆరేళ్లపాటు రూ.300 కోట్లకు పైబడి నిధుల విడుదలకు అవకాశం
- 36 కేంద్ర, రాష్ట్ర పథకాలను జోడించి వ్యవసాయాభివృద్ధికి చర్యలు



పునరుద్ధరణకు నోచుకోనున్న చెక్‌డ్యాంలు

రాజంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో దేశంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటూ వ్యవసాయ పరంగా వెనుకబడి ఉన్న 100 జిల్లాలను ఎంపిక చేసి ఆ జిల్లాలను వ్యవసాయపరంగా అభివృద్ధి చేయడానికి ప్రధానమంత్రి ధన-ధాన్య కృషి యోజన పథకం కింద ఎంపిక చేశారు. గత నెల 11న కేంద్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లాను ధన-ధాన్యం భాగ్యం కింద చేర్చి ఆకాంక్షిత జిల్లాగా అన్నమయ్యను ఎంపిక చేస్తూ వ్యవసాయపరంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేయడానికి నిర్ణయించారు. రాష్ట్రంలో మన జిల్లాతో పాటు శ్రీసత్యసాయి, ప్రకాశం అల్లూరి సీతారామరాజు జిల్లాలను కూడా ఎంపిక చేశారు. గత నెల 10న రాయచోటిలో కలెక్టర్ అధ్యక్షతన 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఈ పథకంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ఈ పథకం ఉపయోగాలను అధికారులకు సవివరంగా తెలిపారు. రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటోంది. కోడూరు, రాజంపేట, పీలేరు నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా రాజంపేట, పుల్లంపేట ఎగువ ప్రాంతాలు, రాయచోటి, మదనపల్లె మెట్ట ప్రాంతాలతో పాటు సుమారు జిల్లాలోని 20 మండలాలు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటూ వ్యవసాయపరంగా చాలా వెనుకబడి ఉన్నాయి. మెట్ట ప్రాంతాలను వ్యవసాయపరంగా అభివృద్ధి చేయడానికి వెనువెంటనే చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ ప్రకటించడంతో జిల్లా వ్యవసాయపరంగా శరవేగంగా అభివృద్ధి చేయడానికి మార్గం సుగమం కానుంది. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి 36 పథకాలను సన్నిహితం చేసి దేశవ్యాప్తంగా ఈ పథకం కింద యేడాది నుంచి ఆరేళ్ల పాటు 24 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ నిధుల్లో అన్నమయ్య జిల్లాకు ఈ ఆరేళ్లలో రూ.300 నుంచి రూ.400 కోట్లు వ్యవసాయాభివృద్ధికి విడుదలయ్యే అవకాశాలు ఏర్పడ్డాయి. ఇందుకోసం ప్రత్యేక అధికారులను కూడా నియమించనున్నారు.




చుక్కనీరు లేక బీడు భూములుగా మారిన వ్యవసాయ భూమి

ఆకాంక్షిత జిల్లాతో ఉపయోగాలెన్నో...

ప్రధానంగా వ్యవసాయాభివృద్ధిలో భాగంగా జిల్లాలో వ్యవసాయ ఉత్పాదన పెంచడం, నీటి వనరుల లభ్యతను పెంచడం, రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు విరివిగా ఇవ్వడం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట మార్పులు చేస్తారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సాహం ఇస్తారు. రైతులకు వివిధ నైపుణ్యాల శిక్షణలు, ప్రత్యేక ప్రాజెక్టులను గుర్తించడం, వ్యవసాయ సంబంధిత అవగాహన కార్యక్రమాలు విరివిగా నిర్వహించడం అధికారుల కొరత లేకుండా చూడడం, ఫుడ్ ప్రాసెసింగ్ చేయడం, పశుసంపద పెంచడం, వ్యవసాయ పరిశ్రమలు ఏర్పాటు చేయడం, మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేస్తారు. ప్రధానంగా జిల్లాలో రైతుల జీవితాలను మెరుగుపరచడానికి ఈ పథకం ఎంతో ఉపకరిస్తుంది. ఆయా ప్రాంతాలకు అనుగుణంగా వరి, వేరుశనగ, పసుపు, పొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటలను విరివిగా పండించే అవకాశం ఉంది. అదేవిధంగా ఉద్యానవన పంటలకు నెలవైన రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో విస్తారంగా పండే బొప్పాయి, అరటి, నిమ్మ, మామిడి పంటల పెంపుదలకు ఈ పథకం ఎంతో ఉపకరించనుంది. తద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి వీలుంటుంది. భూగర్భజలాలు పెంపొందించడానికి, విరివిగా బోరుబావులు, రక్షిత మంచినీటి పథకాలు, చెక్‌డ్యాంలు, చెరువుల్లో పూడిక తీయడం, కాలువలు పునరుద్ధరించడం, చెక్‌డ్యాంలు ఏర్పాటు చేయడం, నీటి వసతులను పెంచడం జరుగుతుంది. వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వీలుంటుంది. పండించిన పంటలను నిల్వ ఉంచుకోవడానికి కోల్డ్ స్టోరేజిలను ఏర్పాటు చేస్తారు. దీంతో పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి ఆస్కారం ఉంటుంది. అటవీ, మెట్ట ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటిన దుర్భిక్ష ప్రాంతాల్లో కొత్తగా నీటి నిల్వలను పెంపొందించే చర్యలు చేపడుతూ అక్కడ బిందుసేద్యం విరివిగా ఏర్పాటు చేయడం జరుగుతుంది. అన్నదాతకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది.

ఆంధ్రజ్యోతే స్ఫూర్తి ...



ఆకాంక్షిత ధన-ధాన్య కృషి యోజన పథకం కింద అన్నమయ్య జిల్లా ఎంపిక కావడానికి ఆంధ్రజ్యోతే ప్రధాన కారణం. నేను ఈ ఏడాది సెప్టెంబరు 6వ తేదీ రాజంపేటకు వచ్చాను. ఇందులో భాగంగా ఈ జిల్లాను ఆకాంక్షిత జిల్లాగా ప్రకటించేందుకు గల కారణాలను ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో సవివరంగా తెలిపారు. ఈ కథనం ప్రచురితం కావడంతో దీన్ని సీఎం చంద్రబాబునాయుడుకు, కేంద్ర ప్రభుత్వానికి సంబంధిత అధికారులకు స్వయంగా నేనే పంపాను. దీనిపై సీఎం స్పందించి కేంద్రానికి విన్నవించడంతో అన్నమయ్య జిల్లాను ఈ పథకంలో చేర్చారు. దీనివల్ల అన్నమయ్య జిల్లా ఈ ఆరేళ్లలో వ్యవసాయపరంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది అన్నదాత అన్నివిధాలా బాగుపడనున్నారు. ఈ ఆరేళ్లలో అన్నమయ్య జిల్లాకే రూ.400 కోట్ల నిధులు రానున్నాయి.

\- లంకా దినకర్,
రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్

జిల్లా ఎంపిక మనందరి అదృష్టం



ఆకాంక్షిత జిల్లాగా అన్నమయ్య జిల్లా ఎంపిక కావడం మనందరి అదృష్టం. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి కనీసం ఒక ప్రధాన ప్రాజెక్టు, ఒక ప్రధానమైన నీటి వనరులు లేని అన్నమయ్య జిల్లాకు ఈ పథకం వరప్రసాదం లాంటిది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమలయ్యే ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా 24 వేల కోట్లు నిధులు విడుదలైతే మన అన్నమయ్య జిల్లాకు ఈ ఆరేళ్లలో రూ.400 కోట్లు నిధులు రావడం వ్యవసాయపరంగా ఎంతో అభివృద్ధి చెందడానికి వీలుంటుంది. ఇందులో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పాత్ర ప్రశంసనీయం.

\- సాయిలోకేశ్‌కుమార్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు

పెద్దేరు వంతెనను ఢీకొన్న లారీ

తమిళనాడు డ్రైవర్‌కు గాయాలు



వంతెనను ఢీకొన్న లారీ

ములకలచెరువు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముంబై - చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం వంతెనను గురువారం ఉదయం ఓ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన డ్రైవర్ గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... హైదరాబాదు నుంచి తమిళనాడు రాష్ట్రం చెన్నైకి వెళ్తున్న లారీ ఉదయం అదుపు తప్పి మండలంలోని పెద్దేరు వంతెనను ఢీకొంది. డ్రైవర్ నిద్రమత్తులో లారీని అదుపు చేయలేక వంతెనను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రం విరుదనగర్ జిల్లా ఎస్.పుత్తూర్‌కు చెందిన అలాగర్ గాయపడ్డాడు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో లారీ ముందు భాగం దెబ్బతింది.

10 ఎర్రచందనం దుంగలు పట్టివేత

ముగ్గురు స్మగ్లర్లు అరెస్టు



పట్టుకున్న దుంగలు, స్మగ్లర్లతో అటవీ అధికారులు

రైల్వేకోడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు రేంజి పరిధిలోని కోడివెంగమ్మ బావి అటవీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం కూంబింగ్ చేస్తుండగా 10 ఎర్రచందనం దుంగలను గుర్తించామని, వాటిని సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నామని రైల్వేకోడూరు రేంజర్ శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ నాగినేని చంద్ర, నాగినేని శివయ్య, నాగినేని సురేంద్ర అనే స్మగ్లర్లను పట్టుకుని వారి వద్ద నుంచి 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దుంగలు 291 కిలోల బరువు కల్గి ఉన్నాయని, వాటి విలువ రూ.1,42,738 చేస్తాయని తెలిపారు. స్మగ్లర్లు జనజీవన స్రవంతిలోకి వచ్చి తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఎర్రచందనం చెట్లను నరికితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. దాడుల్లో ఎఫ్‌ఎస్‌వో ఎం.మహేష్‌కుమార్, ఎఫ్‌బీవోలు ఎం.నాగేశ్వర్‌నాయక్, జనార్ధన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యుమోనియాపై అవగాహన కల్పించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్, తదితరులు

మదనపల్లె అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): న్యుమోనియాపై అవగాహన కల్పించాలని మంత్రి సత్యకుమార్ అన్నారు. గురువారం మదనపల్లె పర్యటనలో భాగంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో న్యుమోనియాపై బ్యానర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రాణాంతకమైన న్యుమోనియా వ్యాధిని నివారించడం, త్వరగా వ్యాధిని గుర్తించి సమయానుకులంగా చికిత్స అందించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. అనంతరం డాక్టర్ లక్ష్మీనరసయ్య బొమ్మనచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణంలో ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. న్యుమోనియా నివారణ చర్యలపై అమలు పరిస్థితి, చిన్నారుల ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్, 104 జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్, ఆరోగ్యకేంద్రాల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్స్ ఫుర్ఖాన్‌ఖాన్, సల్మాన్, విష్ణువర్ధన్, భార్గవి, జిలానీ, రిచర్డ్, టీబీ విభాగ సూపర్‌వైజర్ ప్రభాకర్, శ్రీనివాసులు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేయండి



మాట్లాడుతున్న నారాయణ

రాజంపేటటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.నారాయణ, జిల్లా కార్యదర్శి అంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్తార్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు గుర్రప్ప ఆరోపించారు. గురువారం అన్నమయ్య ప్రాజెక్టును స్థానిక ముంపు ప్రదేశాలను సందర్శించారు. అనంతరం పట్టణంలోని ఎన్జీవో హోంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రాజెక్టు కొట్టుకునిపోవడం వల్ల చుట్టుపక్కల గ్రామాలు నీటమునిగాయని, నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఇళ్లు కట్టివ్వడం, ఇంటి స్థలాలు ఇవ్వడం కాని చేయలేదని చుట్టుపక్కల గ్రామాల్లో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని వారు పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి రైతుకు నీరు అందేలా కృషి చేయాలని లేకపోతే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, సుబ్బరాయుడు, విద్యార్థి సంఘ నాయకుడు నగిరి రాజేంద్రప్రసాద్, నాగేంద్రబాబు, గోపి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై శిక్షణ

సిద్దవటం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు చీడపీడలు, తెగుళ్ల నివారణకు సంబంధించి సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి మండలంలోని జ్యోతి, వంతాటిపల్లె గ్రామాల్లో మామిడి రైతులకు అవగాహన కల్పించారు. నవంబరు, డిసెంబరు మాసాల్లో మామిడి తోటల్లో పూత సమానంగా రావడానికి 10 గ్రాముల చొప్పున జింక్ 2.5 గ్రాములు బోరాన్, 1.25 గ్రాములు లీటరు నీటికి పిచికారి చేయాలని, ముదురు మామిడి తోటల్లో కల్టర్ వాడకంపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ తేనె మంచు పురుగు నివారణకు సరైన సమయంలో మూడు దశల్లో పురుగు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ వరి సాగును తగ్గిస్తూ ఉద్యాన పంటలవైపు రైతులు ఆసక్తి చూపాలని తెలిపారు. కార్యక్రమంలో మామిడి రైతులు, వ్యవసాయ విస్తరణాధికారి ప్రభాకర్‌రెడ్డి, రైతుసేవా సిబ్బంది ప్రేమ్‌సందీప్, హసీనా, చంద్ర, ప్రియదర్శిని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ ముఠా కేసులో రెండో రోజు విచారణ

- మృతదేహం తిరుపతికి తరలింపుపై ఆరా
- బెంగళూరు, గోవాకు ప్రత్యేక బృందాలు
- పోస్టుమార్టం పూర్తి.. బంధువులకు అప్పగింత



యమున మృతదేహం



డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్యతో మాట్లాడుతున్న చిత్తూరు జిల్లా బృందం

మదనపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ వ్యవహారంపై ప్రభుత్వం దర్యాప్తు ముమ్మరం చేసింది. గురువారం చిత్తూరు వైద్య బృందం మదనపల్లెకు రాగా ఇక్కడి పోలీసు బృందం బెంగళూరు, గోవాకు వెళ్లింది. కిడ్నీ ఆపరేషన్ ఎలా జరిగింది..ఎక్కడ జరిగిందని వైద్య, ఆరోగ్యశాఖ ఆరా తీస్తుండగా, దీని వెనుక ఎవరున్నారు? లింకులు ఏంటి? డాక్టర్ ఎవరు? రిసీవర్ ఎవరనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విశాఖపట్నం ఏరియాకు చెందిన యమున (29)ను గాజువాక ప్రాంతానికి చెందిన మధ్యవర్తులు పద్మ, సత్యలు డబ్బులు ఆశ చూపి గ్లోబల్ ఆసుపత్రికి తీసుకొచ్చి కిడ్నీ తొలగించగా మరుసటి రోజు చనిపోయిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి రోజు అన్నమయ్య జిల్లా వైద్య బృందం విచారణ చేపట్టగా గురువారం చిత్తూరు జిల్లాకు చెందిన డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మాంజలి బృందం మదనపల్లెకు చేరుకుంది. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సెకండరీ ఎడ్యుకేషన్ కమిషనర్ చక్రధర్‌బాబు ఆదేశాల మేరకు డీసీహెచ్‌ఎస్‌తో పాటు సీనియర్ సర్జన్ డాక్టర్ హరగోపాల్, అనస్థిషియా స్పెషలిస్టు డాక్టర్ సాయికిశోర్, ఫిజీషియన్ డాక్టర్ అమీర్‌అలీ, ఏడీ ఫణిభూషణ్, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కృష్ణ, తదితరులు ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేశ్‌తో సమావేశమయ్యారు. యమున మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయకుండా తిరుపతికి పంపడంపై ఆరా తీశారు. మానవ అవయవం మిస్సింగ్ అయినట్లు కేసు నమోదు అయిన నేపథ్యంలో యూరాలజీ, ఫోరెన్సిక్ నిపుణులు అందుబాటులో లేకపోవడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేసినట్లు తెలిపారు. అనంతరం స్థానిక జిల్లా ఆసుపత్రిలోని టెక్నీషియన్ బాలరంగడు వ్యవహారంపై డయాలసిస్ కేంద్రంలోని వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సంఘటన జరిగిన గ్లోబల్ ఆసుపత్రికి చేరుకున్నారు. అన్నమయ్య జిల్లా డీసీహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ అంజనేయులు నుంచి నివేదిక రూపంలో వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారు. అయితే ఆయన అప్పటికే పోలీసుల అదుపులో ఉండటంతో తిరిగి వెళ్లిపోయారు.

బెంగళూరు, గోవాకు పోలీసులు

యమున నుంచి కిడ్నీని తొలగించడంలో కీలకంగా వ్యవహరించిన డాక్టర్, రిసీవర్ కోసం పోలీసు బృందాలు బెంగళూరు, గోవాకు వెళ్లినట్లు తెలిసింది. ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకోగా, వారిచ్చిన సమాచారం మేరకు బెంగళూరు, గోవాకు వెళ్లారు. గోవాలో రిసీవర్‌తో పాటు స్పెషలిస్టు వైద్యుడు, మరో మధ్యవర్తి కూడా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ కేసులో బెంగళూరు వైద్యుడు, డయాలసిస్ టెక్నీషియన్లు, మధ్యవర్తులు కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. యమునకు విశాఖపట్నంలోనే కిడ్నీ పరీక్షలు నిర్వహించి, తర్వాత తొలగించడానికి మదనపల్లెకు తీసుకొచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.


తిరుపతిలో పోస్టుమార్టం పూర్తి

యమున మృతదేహాన్ని మంగళవారం తిరుపతికి తీసుకెళ్లారు. దానిపై వివాదం చెలరేగడంతో అదేరోజు రాత్రి మదనపల్లెకు తీసుకురాగా ఇక్కడ స్పెషలిస్టులు లేకపోవడంతో బుధవారం రాత్రి తిరిగి తిరుపతికి రుయాకు తరలించారు. అక్కడ పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎడమవైపున కిడ్నీ తొలగించినట్లు చెబుతున్నారు. ఇదిలావుండగా, గ్లోబల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ అంజనేయులు మాత్రం తాను ఆసుపత్రిని ఇతరులకు లీజుకు ఇచ్చానని, కిడ్నీ తొలగింపు విషయం తనకు తెలియదని పోలీసులతో చెప్పినట్లు తెలిసింది. డాక్టర్ కూడా కిడ్నీలో రాళ్లు తొలగించే ప్రక్రియ చేపట్టేవారని, కిడ్నీ తొలగించి డోనర్ మృతికి కారణమైన విషయం తనకు తెలీదని చెప్పినట్లు తెలిసింది.

విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

మదనపల్లెలో జరిగిన కిడ్నీ రాకెట్ కేసు విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. గురువారం మదనపల్లెకు వచ్చిన మంత్రి కిడ్నీ ఆపరేషన్ వ్యవహారంలో దోషులు ఎవరున్నా, ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికే ఏ-1 డాక్టర్ అంజనేయులుతో పాటు మరో ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు మంత్రి తెలిపారు. మదనపల్లె తరహా ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా కూడా ఎక్కడైనా జరిగాయా? ఇలాంటి కార్యకలాపాలు కొనసాగే పరిస్థితులపై కూడా దృష్టి కేంద్రీకరించినట్లు మంత్రి వివరించారు.

చోరీలను నివారిస్తాం : డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

సిద్దవటం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గస్తీల్లో పోలీసులను ఏర్పాటు చేసి చోరీలను నివారిస్తామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఆయన మండల కేంద్రమైన సిద్దవటం పోలీసుస్టేషన్‌లో పలు విభాగాల రికార్డులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీల నియంత్రణకు రాత్రివేళల్లో పోలీసుల గస్తీలు, పల్లె నిద్ర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రౌడీషీటర్లు గ్రామాల్లో ఘర్షణలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు, ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ సుబ్బారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్, బైక్ ఢీ ఘటనపై కేసు నమోదు

బి.కొత్తకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూరపువారిపల్లె వద్ద ఈనెల 11న ద్విచక్రవాహనంలో వెళుతున్న బత్తుల శంకరను టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో గట్టు పంచాయతీ పరిధిలోని శంకర్ తల, ఎడమకాలుకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని బి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మదనపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపి తన భర్తను తీవ్రంగా గాయపరిచాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి భార్య మంజుల గురువారం ఫిర్యాదు చేసిందని ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపాల్‌రెడ్డి గురువారం తెలిపారు.

వడ్డెరుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాగళం రాష్ట్ర అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు



మీడియాతో మాట్లాడుతున్న ఇడగొట్టు నాగేశ్వరరావు

రాయచోటిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా క్వారీల్లో వడ్డెరుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వడ్డెర ప్రజాగళం రాష్ట్ర అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన వడ్డెరుల, భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఇబ్రహీంపట్నంలోని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ కార్యాలయం వద్ద వడ్డెర ప్రజాగళం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య, గుంటూరు, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో క్వారీల్లో వడ్డెరులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ సుమారు 200 మందితో రాష్ట్ర మైన్స్ డైరెక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లామని, వడ్డెరుల నిరసనకు స్పందించిన మైనింగ్స్ రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వారం పది రోజుల్లో క్వారీల్లో వడ్డెరుల సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేశారన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన అవసరం

జిల్లా ఆరోగ్య విద్యాధికారి గుణశేఖర్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న గుణశేఖర్

రాయచోటిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, వృత్తి మార్గదర్శకతపై అవగాహన అవసరమని జిల్లా ఆరోగ్య విద్యాధికారి పి.గుణశేఖర్ తెలిపారు. గురువారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ శివశంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నిజాయితీ, సానుకూల దృక్పథంతో ప్రారంభమవుతుందని చెప్పారు. అనంతరం స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో స్టెప్ సూపరింటెండెంట్ నారాయణ, కళాశాల ఈఈఈ విభాగాధిపతి ఇందిర ప్రియదర్శిని, ఈసీఈ విభాగాపధిపతి చెన్నకేశవప్రసాద్, జనరల్ సెక్షన్ ఇన్‌చార్జ్ నాగసురేంద్రారెడ్డి, ఐఎస్‌టీఈ కో-ఆర్డినేటర్ బుజ్జిబాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సహదేవ పాల్గొన్నారు.

విజయవంతంగా క్రీడా పోటీలు

- 19 నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11, 13 తేదీల్లో రాయచోటిలోని డీఎస్ఏ క్రీడా మైదానం జిల్లా స్థాయిలో సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపికలు విజయవంతంగా నిర్వహించామని జిల్లా క్రీడా అధికారి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, కబడ్డీ, లాన్ టెన్నిస్, క్యారమ్స్, హాకీ, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్ అండ్ పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, వాలీబాల్, యోగా, బెస్ట్ ఫిజిక్యూ, రెస్లింగ్ (కుస్తీ), డ్యాన్స్ మ్యూజిక్ అండ్ షార్ట్‌ల ప్లే విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయని వారు తెలిపారు. ఈ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా క్రీడా జట్లకు ఎంపిక చేశారని ఆయన తెలిపారు. ఎంపికైన ఈ జట్లు ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు విజయవాడ, గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

అధిక శబ్దాల సైలెన్సర్లు వాడితే కఠిన చర్యలు : డీఎస్పీ



కడప ఏడు రోడ్ల కూడలిలో సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేస్తున్న దృశ్యం

కడప క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలిగించేలా అధిక శబ్దాలు చేసే సైలెన్సర్లను వాడే ద్విచక్రవాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం కడప ట్రాఫిక్ సీఐ కె.జావీదు, సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో సుమారు 40 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం కడప ఏడు రోడ్ల కూడలిలో సైలెన్సర్లను ధ్వంసం చేశారు.

ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులకు ఎన్నిసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పు రావడంలేదని, ఇకపై అధిక శబ్దం కలిగే సైలెన్సర్లను వాడే వాహనం పట్టుబడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలన్నారు. నగరంలో శబ్ధ కాలుష్యాన్ని తగ్గించడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అధిక శబ్దాల వల్ల వృద్ధులు, రోగులు, పాదచారులు, మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే కంపెనీ సైలెన్సర్లను మార్చి అధిక శబ్దాలు కలిగించే సైలెన్సర్లను అమర్చే మెకానిక్‌లపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

వరి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు : ఏడీఏ



వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

వేంపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరి పంట పండించే రైతుల కోసం వరిధాన్యం సేకరణకు తగిన ఏర్పాట్లను చేశామని పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇడుపులపాయ-2 రైతు సేవా కేంద్రాన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంగా కేటాయించడంతో ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని మూడు గ్రామాలలో 700 మంది రైతులు వెయ్యి ఎకరాలలో వరి పంటను సాగుచేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరిధాన్యం సేకరణకు తగిన ఏర్పాట్లను చేశామన్నారు. ఇందులో భాగంగా వరిధాన్యం గ్రేడ్-ఏ రకం క్వింటాల్‌కు రూ.2389, సాధారణ రకం క్వింటాల్ రూ.2369 గాను ప్రభుత్వం నిర్వహించడం జరిగిందన్నారు. తేమశాతం 17శాతానికి, చెత్త,రాళ్లు, తాలు ఒక శాతానికి మించరాదని చెడిపోయిన, రంగుమారిన విత్తనాలు ఐదు శాతానికి మించరాదని, పరిపక్వానికి రాని మరియు వంకర తిరిగిన గింజలు మూడు శాతానికి మించకూడదని ఆయన రైతులను ఉద్దేశించి తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రాల సిబ్బంది సురేఖ, మహేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ కేసులో ఇరువురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళినాయక్

పులివెందుల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలంలోని మురారిచింతల, అంబకపల్లె గ్రామ పొలాల్లో కేబుల్ వైర్ల దొంగతనం కేసులో ఇరువురిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం డీఎస్పీ మురళీనాయక్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. బుడగజంగం మోతీ జయమయ్య, బుడగజంగం మోతీనాగరాజు అనే ఇరువురిని కేబుల్ దొంగతనం కేసులో అరెస్టు చేశామన్నారు. తండ్రీ కొడుకులైన వీళ్లు స్టీల్, అల్యూమినియం పాత్రలను ఆటోలో వేసు కొని పులివెందుల నియోజకవర్గంలోని పలు మండలాల్లో తిరుగుతూ వ్యాపారం చేసేవారు. ఆ సమయంలో కొందరు పాత వైర్లను వేసి పాత్రలు కొనుగోలు చేశారు. వాటిని కాల్చి అందులో ఉన్న కాపర్ తీగలను విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఇందులో మంచి ఆదాయం రావడంతో రైతుల పొలాల వద్ద ఉన్న కేబుల్‌వైర్ చోరీ చేసి సొమ్ము చేసుకోవడం అలవాటుగా మార్చుకున్నారు. ఈనేపథ్యంలో వీరిపై ఎస్‌ఐ అనిల్‌కుమార్ నిఘా పెట్టి అంబకపల్లె గ్రామ సమీపంలో అరెస్టు చేశారని తెలిపారు. కాగా, రైతుల పొలాలవద్ద వ్యవసాయ పరికరాల చోరీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



మనోజ్‌కుమార్ మృతదేహం

బద్వేలుటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోరు మామిళ్ల బైపాస్‌రోడ్డు భగత్‌సింగ్‌కాలనీలో బందెల మనోజ్ కుమార్ (25) అనే యువకుడు గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మృతి చెందాడు. ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారు తలుపులు తెరవగా ఉరివేసుకొని వేలాడుతూ కనిపించారు. వెంటనే తల్లి కుమారికి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మనోజ్‌కుమార్ జీవనోపాధికోసం ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఏమైందో ఏమో తెలియదుకానీ ఉరివేసుకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

చక్రాయపేట ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



రెడ్డయ్య (ఫైల్)

చక్రాయపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ దర్శి రెడ్డయ్య (45) గురువారం మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు.... రెడ్డయ్య అనారోగ్యం బారిన పడడంతో తిరుపతికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఇతనికి భార్య ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఇతని మృతి పట్ల టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళ అదృశ్యం



మైదుకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం శివపురం గ్రామానికి చెందిన భూమాయపల్లి ఓబుళమ్మ(57) అదృశ్యమైంది. ఈమె భర్త వెంకటసుబ్బయ్య మరణించడంతో కుమారుడు దుర్గాప్రసాద్ సంరక్షణలో ఉంటున్నారు. గత మంగళవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమారుడు తన తల్లి కనిపించడం లేదని పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉమామహేశ్వరాలయంలో నవగ్రహాలు ధ్వంసం



పెకలించిన విగ్రహాలు

చెన్నూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట ఉమా మహేశ్వరాలయంలో నూతనంగా ప్రతిష్ఠ చేసిన నవగ్రహాల్లో రెండు విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం మధ్యాహ్నం ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన రెండు విగ్రహాల్లో ఒకటి పక్కన ఉన్న తమలపాకు తోటలో, మరో విగ్రహాన్ని ప్రతిష్ఠ జరిగిన చోట పక్కన పడేశారు. ఈ విషయమై ప్రజల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

ఎయిడ్స్‌వ్యాధి గ్రస్తుల పట్ల చిన్న చూపు తగదు

● జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్

కడప కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌వ్యాధిగ్రస్తుల పట్ల చిన్న చూపు, వివక్షత తగదని.. సమాజంలో వారు కూడా అందరితో సమానంగా భావించాలని జిల్లా సీనియర్ సివిల్‌జడ్జి బాబాపక్రుద్దీన్ అన్నారు. గురువారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ బాధితులు, వారి పిల్లలతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సవిల్ జడ్జి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపేవారిపై చర్యలు తప్పవన్నారు. వారికి హెచ్‌ఐవీ నవరణ చట్టం 2017 యాక్ట్ అండగా ఉంటుందన్నారు. వ్యాధిగ్రస్థులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, మెరుగైన జీవన ప్రమాణాలను పెంచుకోవాలన్నారు. నల్సా పథకం అయిన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా వారి పిల్లల సంరక్షణకు స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం-2024, న్యాయసేవ అధికార సంస్థ మానసికంగా అనారోగ్యంగా ఉన్న వ్యక్తులు, మేథో వైకల్యం ఉన్న వ్యక్తులకు చట్టపరమైన అంశాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, హెచ్‌ఐవీ వ్యాధిపై ఆందళన వద్దని, జీవన ప్రమాణాలు పెంచేందుకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవికుమార్, శిశు సంక్షేమశాఖ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాన్, ఎంఈవో రఫీక్ అహమ్మద్, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, పాజిటీవ్ నెట్ వర్క్ అధ్యక్షురాలు ఉష తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయకపోతే ధర్నా చేస్తాం

● ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి



సీఐకి వినతి పత్రం ఇస్తున్న ఎంపీ అవినాశ్‌రెడ్డి

సింహాద్రిపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంకాళమ్మ గూడూరు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న హార్టికల్చర్ అసిస్టెంటు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రైతుల వద్ద తీసుకున్న డబ్బులు వారం లోపు చెల్లించకుంటే కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బాధిత రైతులకు న్యాయం చేయాలంటూ ఆయన గురువారం రైతులతో కలసి సింహాద్రిపురం పోలీసు స్టేషన్ వద్ద పులివెందుల రూరల్ సీఐ రమణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. రైతులు సకాలంలో పంట సాగు చేసేందుకు విత్తన శనగలకు, ఎరువుల బస్తాలకు డబ్బులు చెల్లిస్తే.. దాదాపు రూ.20 లక్షలు తీసుకుని పారిపోయిన ఉద్యోగిపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. సంబంధిత అధికారులైనా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించకపోవడానికి కారణం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. ఈ విషయం తెలిసిన డీఎస్పీ మురళీ నాయక్ అక్కడకు చేరుకొని మాట్లాడారు. హార్టీకల్చర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చేతుల్లో మోసపోయిన రైతులకు న్యాయం చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసిన ప్రవీణ్‌కుమార్ రెడ్డిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామన్నారు. అతన్ని త్వరలోనే అరెస్ట్ చేసి, చట్టప్రకారం రైతులకు న్యాయం చేస్తామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల రూరల్ సీఐ రమణ, ఎస్ఐ పాల్గొన్నారు.

19న విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బద్వేలు బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలలో వైవీయూ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ (పురుషులు, మహిళల) సింగిల్స్ డబుల్స్ విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ కె.రామ సుబ్బారెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థలలో చదివి ఉండాలన్నారు. తమ వెంట ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్‌తో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలపై అటెస్ట్ చేయించి తీసుకురావాలన్నారు. క్రీడాకారుల వయో పరిమితి 17 సంవత్సరాల పైబడి 25 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9705459052 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

హోటళ్లపై దాడులు 35 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

జమ్మలమడుగు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో గురువారం హోటళ్లు, చికెన్ సెంటర్లపై దాడులు చేశారు. ఇంటిలో వినియోగించే గ్యాస్ సిలిండర్లు హోటళ్లలో, చికెన్ సెంటర్లలో వినియోగిస్తున్నారని సమాచారం రావడంతో జమ్మలమడుగు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గోవిందుమోరే తహసీల్దారు కార్యాలయ సిబ్బందితో తనిఖీలు చేసి 35 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. హోటల్స్‌లో కమర్షియల్ సిలిండర్లు మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. ఇంటి అవసరాలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దేశం బలమైన ఆర్థికశక్తిగా ఎదగాలి

ఖాజీపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరచి దేశాన్ని బలమైన ఆర్థికశక్తిగా చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తపేట, నాగసానిపల్లె పంచాయతీల్లో ప్రతి ఇంట స్వదేశీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వదేశీ వస్తువులు కొనుగోలు చేయాలని, విదేశీ వస్తువుల పై మొగ్గుచూపవద్దని అన్నారు.

వైవీయూ రిజిస్ట్రార్‌ను తొలగించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలో ప్రతి పనిలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజారుస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మను తక్షణం తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో గతంలో, ఇప్పుడు అవకతవకలు జరుగుతూనే ఉన్నాయని, దీనిపై ఉపకులపతి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. చెత్త దందాపై విచారణ చేసి క్లీన్‌చిట్ ఇస్తే విచారణ నివేదికను ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. విశ్వవిద్యాలయంలో వైద్య కేంద్రంలో కనీసం మాత్రలు కూడా అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

కళాశాల అభివృద్ధి మండలి (సీడీసీ)లో పాత ఇంటర్నల్ రికార్డ్స్ అమ్మకం కోసం సీడీసీ డీన్ 30.10.2025న జారీ చేసిన వైవీయూ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారని, ఈ కొటేషన్ లేఖలో 03.10.2025లోపు కొటేషన్లు చేరాలని పేర్కొనడం వైవీయూ అధికారులకే సాధ్యమన్నారు. కావాలని తేదీ తప్పుగా వేసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. నిబంధనలకు గాలికి వదిలేసి 10.11.2025న పాత రికార్డ్స్ అక్రమంగా అమ్ముకున్నారని ఆరోపించారు.

లెప్రసీ పరీక్షలు తప్పక చేయించుకోండి

కలసపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది గుర్తించిన కొన్ని లక్షణాలు గల ప్రజలు తప్పకుండా లెప్రసీ పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజలు పేర్కొన్నారు. జాతీయ కుష్ఠునిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. శరీరంపై స్పర్శలేని రాగిరంగు పొడ మచ్చలు, నొప్పితో కూడిన లావునరాలు, కండరాల బలహీనత తదితర లక్షణాలు కలవారు లెప్రసీ పరీక్షలు తప్పక చేయించుకోవాలన్నారు.

భారీ స్కోర్లు సాధించిన నెల్లూరు, కడప జట్లు



కిన్నుకిషల్, సాయికృష్ణచైతన్య, రక్షణ్‌సాయి

కడప స్పోర్ట్స్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్స్ క్రికెట్ మ్యాచ్‌లలో గురువారం మొదటిరోజు ఆటముగిసే సమయానికి తమ ప్రత్యర్థి జట్లపై కడప జట్టుతో పాటు నెల్లూరు జట్లు భారీ స్కోర్లు సాధించాయి.

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగి 70.1 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 351 పరుగులు సాధించి డిక్లేర్ చేసింది. ఇందులో కిన్నుకిషల్ 163, సూర్యప్రకాశ్ 65, కార్తీ 51 పరుగులు చేయడంతో భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 300 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.2 ఓవర్లలో 289 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సాయి కృష్ణచైతన్య 107, శివచరణ్ 65 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్ రక్షణ్‌సాయి 5 వికెట్లు సాధించారు. అనంతరం చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 7 ఓవర్లలోనే 3 ప్రధాన వికెట్లు కోల్పోయి కేవలం 11 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు మరో 278 పరుగులతో వెనుకబడింది.

బాలల భవిష్యత్‌ను చక్కదిద్దడానికే బాలోత్సవం



బాలోత్సవ బుక్‌లెట్స్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రొద్దుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వర్తమాన సమాజంలో బాలల భవిష్యత్తును చక్కదిద్దడానికి... వారిలో సృజనాత్మక వికాసానికి బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు రిటైర్డ్ ఇండస్ట్రీస్ జాయింట్ డైరెక్టర్ గుర్రాల గోపాల్ తెలిపారు. గురువారం స్థానిక హోమస్‌పేటలోని జేవీవీ కార్యాలయంలో ఈనెల 29, 30న కడప మరియాపురంలోని సెయింట్‌జోసఫ్ బాలికల పాఠశాలలలో నిర్వహిస్తున్న బాలోత్సవ బుక్ లెట్స్‌ను ప్రముఖులు ఆవిష్కరించారు.

ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాల విద్యార్థులకు నవంబరు 29న వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, మట్టితో బొమ్మలు, కథ రచనను సీనియర్స్, జూనియర్స్ విభాగాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం, రోడ్డు ప్రమాదాలు నివారణ, భారత రాజ్యాంగం- ప్రాథమిక హక్కులు, జూనియర్స్ విభాగంలో మాదక ద్రవ్యాలు-చెడుప్రభావాలు, నెహ్రూ డిస్కవరీ ఆఫ్ ఇండియా, డార్విన్ పరిణామ సిద్ధాంతాలు వ్యాసరచనగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 30న కూడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచినవారు నవంబరు 23 లోపు గూగుల్ ఫామ్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఈ పోటీల్లో గెలిచిన ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ డిప్యూటీ డీఈవో నాగము నిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రిటైర్డ్ హెడ్మాస్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

డ్రగ్స్ వాడకంతో జీవితాలు నాశనం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వాడడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వరాల రమేశ్ పేర్కొన్నారు. నేషనల్ సర్వీస్ స్కీమ్‌లో భాగంగా ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులచే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చౌటపల్లిను దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా చౌటపల్లిలో మానవహారం నిర్వహించి ప్రతి ఇంటికి తిరిగి డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా డ్రగ్స్ అక్రమంగా విక్రయిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1972కి కాల్ చేయాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

గాలివీడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నూలివీడులోని ఎస్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య కంటి శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక నాయకుడు లోకేశ్వర్‌రెడ్డి సహాయ సహకారాలతో లక్ష్మీ ప్రథమ చికిత్స కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో 7 గ్రామ పంచాయతీలకు చెందిన కంటి సమస్య ఉన్న వారు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మొత్తం 200 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 71 మందికి అవసరమైన మందులను, అద్దాలను ఉచితంగా అందజేశారు. రిటైర్డ్ లెక్చరర్ భయ్యారెడ్డి, వైద్యులు రామాంజులు, సాంబశివలు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె పంచాయతీలోని దేవళంపల్లిలో వెలసిన చెన్నకేశవస్వామి ఉత్సవంలో భాగంగా వారం రోజుల పాటు స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం భూదేవి శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కన్నులవిందుగా జరిగింది. ఈ కార్యక్రమం తిలకించడానికి నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వాముల వారి కల్యాణోత్సవం తిలకించారు. ఈ కార్యక్రమానికి మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మదన్‌మోహన్, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవానందరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పాపయ్య, సిద్ద వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం చేయవచ్చని కె.రామాపురం పట్టణ పీహెచ్‌సీ వైద్యాధికారి వసీ అక్రమ్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఎస్టీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. అక్కడ ఉన్న పిల్లలకు చిన్న చిన్న జబ్బులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నూర్జహాన్, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులను విక్రయిస్తే చర్యలు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన ఎరువులు, పురుగు మందులను రైతులకు విక్రయిస్తే చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకుడు మజీద్‌అహ్మద్ పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువుల ధరల నియంత్రణ ఉండాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మండలంలోని బోరెడ్డిగారిపల్లె గ్రామంలో గురువారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అధికారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి తక్షణమే పలువురు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు దుశ్శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.

టీడీపీ మండల కార్యాలయం ప్రారంభం

మండల కేంద్రంలోని కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై మండల టీడీపీ అధ్యక్షుడు మూగి రెడ్డెప్ప ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, మంత్రి సతీమణి హరితమ్మ వారి సోదరుడు టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డిలు కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యులను గజమాలల, శాలువాలతో మండల అధ్యక్షుడు మూగి రెడ్డెప్ప కుటుంబ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల ఏకరి చైర్మెన్ నాగేశ్వర్‌నాయుడు, ఏపీఐఐసీ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు

ఎన్నికల హామీల్లో తీసుకువచ్చిన సూపర్‌సిక్స్‌తో పాటు ఇతర హామీలను కూడా కూటమి ప్రభుత్వం అమలు చేసింది. గత ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేయడంలో విస్మరించింది. నిన్నటి దినం రాయచోటి నియోజకవర్గంలో పర్యటించిన సీఎం చంద్రబాబు సాగు, తాగునీరుపై వరాలు జల్లు కురిపించారు. శ్రీనివాసపురం, వెలిగల్లు జలాశయం పనులు పూర్తయితే నియోజకవర్గ వ్యాప్తంగా 70 వేల ఎకరాలు సాగుకు నీరు అందుతుంది. త్వరలోనే టెండర్లు పిలిచి పూర్తయ్యేలా చర్యలకు కృషి చేస్తామన్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ స్వర్ణలత

రాజంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలో బోయనపల్లె అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా సేవలు అందిస్తున్న డాక్టర్ డి.స్వర్ణలతకు అనంతపురం జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం వారు ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు అందజేశారని కళాశాల వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి గురువారం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు యూనివర్శిటీ అప్రైసియేషన్ అవార్డ్-2025లో భాగంగా జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం వారి బృందం వైస్ చాన్సలర్ హెచ్.సుదర్శన్‌రావు, రిజిస్టర్ ఎస్.కృష్ణయ్య, ఎస్.వి సత్యనారాయణతో పాటు ఇతర విశ్వవిద్యాలయ డైరెక్టర్లు ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలతకు అవార్డును అందజేశారు. అవార్డు గ్రహీతలైన డాక్టర్ స్వర్ణలతను అన్నమాచార్య విశ్వ విద్యాలయం వీసీ డాక్టర్ ఈ సాయిబాబారెడ్డి ఇతర అడ్మినిస్ట్రేటివ్ బృందం అభినందించారు. అన్నమాచార్య యూనివర్శిటీ యాజమాన్యం కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డి, కోశాధికారి పి.అభిషేక్ రెడ్డి, ఛైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డిలు అభినందించారు.

పచ్చదనంపై అవగాహన

సిద్దవటం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో సభాభవనంలో గురువారం ఎంపీడీవో ఫణిరాజకుమారి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు పరిశుభ్రత పచ్చదనంతో ఉండేందుకు ఉన్నతాధికారి ఆదేశాలతో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి మెహతాజ్ యాస్మిన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్, పీఆర్‌ఏ నాగరాజు, ఏపీఎం సుజాత, ఏపీవో నరసింహులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విరమించుకోవాలి

రైల్వేకోడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. గురువారం రైల్వేకోడూరు మండలం రెడ్డివారిపల్లె పంచాయతీలోని గాంధీనగర్‌లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్‌బాబు, మాజీ టూరిజం డైరెక్టర్ మండల నాగేంద్ర, సుబ్బరామరాజు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు

రైల్వేకోడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పరిధిలో ఉన్న ప్రభుత్వ హైస్కూలు ఆవరణంలో పిచ్చి మొక్కలను అనంతరాజుపేట ఎంపీటీసీ సభ్యులు బండారు మల్లికార్జున గురువారం తన సొంత ఖర్చులతో తొలగించారు. మొత్తం ఆవరణం ట్రాక్టర్ డోజర్‌తో చదును చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

చిట్వేలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ అన్సారీ ఆధ్వర్యంలో స్కూలు ప్రిన్సిపల్ తులసి పర్యవేక్షణలో గురువారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు అవసరమున్న వారికి కళ్లజోడు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల హెల్త్ ఆఫీసర్ విజయ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌సీ రుకియాబాను, ఏఎన్ఎం పరిదా, ఆశావర్కర్ రాధా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు వినియోగంపై చర్యలు తీసుకోవాలి

ఓబులవారిపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు అమ్మకం చేస్తున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు.. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం వారు వినతిపత్రం అందించారు. జనసేన పార్టీ నాయకుడు కిషోర్, నాగభూషణం, సుబ్రమణ్యం, హరి తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస పెంపకం సద్వినియోగం చేసుకోవాలి

● పశుసంవర్థకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై

సుండుపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద ఉచితంగా పశుగ్రాస పెంపకం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. గురువారం మండలంలోని తిమ్మసముద్రం గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఏపీఎల్‌డీఏ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పశువులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉప సహాయ సంచాలకుడు విజయ్‌కుమార్, డాక్టర్ మాలకొండయ్య, డాక్టర్ చాంద్‌బాషా, డాక్టర్ సుధాకర్, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరం

● క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

నందలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యాధిగ్రస్థులు, వైద్యులు, సిబ్బంది సూచనలు సలహాలు పాటించడంతో పాటు ఆరు నెలల పాటు మందులు వాడితే పూర్తి స్థాయిలో క్షయవ్యాధి దూరమవుతుందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్‌లు అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 13 మంది టీబీ పేషంట్లను నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ దత్తత తీసుకున్నారు. ఇందులో భాగంగా రెండు నెలలకు సరిపడా పౌష్టికాహారాన్ని సర్పంచ్ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి, సుబ్రహ్మణ్యం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రణీత్, శివరాం, సీహెచ్‌వో వెంకటనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ ఆరిఫ్, మాజీ మార్కెటింగ్ డైరెక్టర్ బెస్త సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలి : ఏవో

రాజంపేటటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాలను గురువారం జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు వ్యవసాయ సంచాలకుడు రైల్వేకోడూరు ఎస్.మణి, రాజంపేట వ్యవసాయాధికారి జి.నాగలక్ష్మీ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఐదు ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసి ఎరువుల నిల్వలను పరిశీలించారు. దుకాణదారులు నిబంధనలను వ్యతిరేకిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రధానరహదారి గుంతలకు మరమ్మతులు



అనంతరాజుపేట హైస్కూలు మైదానాన్ని చదును చేయిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధానదారి (సిమెంట్ రోడ్డు)లో గుంతలు ఏర్పడ్డాయని, వీటి వల్ల ప్రమాదాలు జరిగి ఇప్పటికే సుమారు పది మంది ప్రాణాలు కోల్పోయారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇటీవల కథనం ప్రచురితమైంది. గురువారం నేషనల్ హైవే అధికారులు దీనిపై స్పందించి గుంతలు ఏర్పడ్డ దగ్గర మరమ్మతులు చేశారు. ఆర్‌టీసీ అప్రోచ్ రోడ్డు నుంచి వెంకయ్యస్వామి ఆలయం వరకు మరమ్మతులు చేశారు. ఇటీవల గుంతలతో దుమ్ము, ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డుకు మరమ్మతులు చేయడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధితులను పరామర్శించిన పంతగాని

పెనగలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, దివంగత శింగనమల మాజీ సర్పంచ్ నీరుగట్టు యానాదయ్య కుటుంబ సభ్యులను గురువారం సాయంత్రం టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ పరామర్శించారు. యానాదయ్య మృతిచెందిన రోజు తాను అందుబాటులో లేకపోవడం వల్ల రాలేకపోయానని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, నరసింహులుతో పాటు టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి అంబులం పూజ

సుండుపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముడుంపాడు పంచాయతీ కుర్వపల్లిలో వెలిసి ఉన్న భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణంలో అయ్యప్పస్వామి అంబుళంపూజ మాలధారణ భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి గ్రామంలోని నాలుగు కుటుంబాల వారు కలిసి పూజ ఏర్పాటు చేశారు. పూజలో భాగంగా ప్రత్యేకంగా అరటి బెరడులతో ఏర్పాటు చేసిన మందిరాల్లో వినాయక, అయ్యప్ప, సుబ్రమణ్యంస్వామి, ఈశ్వరుడు, పార్వతి, ప్రతిమలు ఏర్పాటు చేసి వివిధ రకాల పూలతో అలంకరించారు. మాలధారణ భక్తులు భక్తిగేయాలు ఆలపించి పడిపూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయుల చేయూత



విద్యార్థి తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెనగలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లపురెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కల్యాణ్‌కుమార్ అనే విద్యార్థి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నాడు. విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు హెడ్మాస్టర్ కె.కృష్ణమూర్తి అధ్యక్షతన రూ.30 వేలు విరాళాలు సేకరించి గురువారం మందరం గ్రామంలో ఇంటివద్ద ఉంటున్న విద్యార్థి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థిని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

రూ.50 వేలు విరాళం



నగదును అందజేస్తున్న సుధాకర్‌బాబు దంపతులు

రైల్వేకోడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.బుడుగుంటపల్లె గ్రామం వద్ద వెలసి ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అన్నదాన సత్రానికి దాతలు రూ.50 వేలు విరాళం ఇచ్చారు. మండలంలోని శింగిరివారిపల్లెకు చెందిన కుంచా వెంకటసుబ్బమ్మ, జయరామయ్యల జ్ఞాపకార్థంగా గురువారం వారి కుమారుడు సుధాకర్‌బాబు నగదు అందజేసినట్లు ఆలయ ధర్మకర్త అదునుకోట నరసింహులు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి అన్నదాన సత్రం నిర్మాణానికి సహకరించాలని కోరారు.

పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలిజవీధిలో గంగమ్మతల్లి మండపం వద్ద గురువారం ముత్యాల పెంచలయ్య, హైమావతిల ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ముందుగా గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల కిషోర్, పోతురాజు సుమన్, పంద్రా పెద్దోడు, నార్జాల హేమరాజ్, ఉంగరాల చంద్రశేఖర్, నార్జాల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవం

రామాపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి ఈ నెల 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ ఉద్యోగి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రామాపురంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అక్షర సమాజం పుట్టినరోజు నుంచి గ్రంథాలయాలు జీవన వికాసానికి సామాజిక పురోగతికి సోపానాలు అన్నారు. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక

చిట్వేలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు సాయివికాస్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయనను విద్యార్థులు అభినందించారు. ఈ నెల 8, 9 తేదీల్లో ప్రొద్దుటూరు వైఎస్ఆర్ కాలనీ స్టేడియం సబ్ జూనియర్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారన్నారు. బాల బాలికల విభాగంలో బి.లోహిత, సుదీప, కుస్మిత, బాలుర విభాగంలో అనూజ్, గీతేశ్వరరెడ్డి, దవనేశ్వర్‌రెడ్డి బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ శివాజి తెలిపారు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 14, 15, 16 తేదీల్లో కాకినాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

రైల్వే అభివృద్ధికి కృషి చేయండి

నందలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వే అభివృద్ధికి కృషి చేయాలని నందలూరు రైల్వేస్టేషన్ కన్సొలేటివ్ మెంబర్ రాచూరి మురళి కోరారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్‌ను సికింద్రాబాదు రైల్వే నిలయంలో కలిసి వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ నందలూరు రైల్వేస్టేషన్‌కు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, చెన్నై-ముంబై ట్రైన్లను నందలూరులో స్టాపింగ్ ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

మైక్ సెట్ వితరణ



మైక్‌సెట్ అందజేస్తున్న జనసేన నేతలు

రాజంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మైక్ సెట్‌ను గురువారం జనసేనపార్టీ ఐటీ కోఆర్డినేటర్ ఇడిమడకల సాయిశ్రీనివాస్ వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉదయం విద్యార్థులకు ప్రార్థన పలు కార్యక్రమాల కోసం రూ.12 వేలు విలువ చేసే మైక్ సెట్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పత్తి మణి, కోలాటం హరిక్రిష్ణ, ముత్యాల చలపతి, నారదాసు రామచంద్ర, పాఠశాల కమిటీ ఛైర్మన్ నాగరాజు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

యూరియాను సద్వినియోగం చేసుకోండి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): యూరియా అందుబాటులో ఉందని, ప్రతి రైతు రబీ సీజన్‌లో ఉపయోగించుకోవచ్చని మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ పేర్కొన్నారు. గురువారం దప్పేపల్లెలో రైతు సేవా కేంద్రంలో యూరియా, ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కోనంపేట, దప్పేపల్లె సర్పంచులు కేశవులు, లక్ష్మినారాయణ, రైతు సేవా సిబ్బంది కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గోవిందు, వెంకటేశ్, చిన్నగంగయ్య, కావలి ఆంజనేయులు, ఆనందరెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

ఒంటిమిట్ట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో సుజాతమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా థీమ్-5 పరిశుభ్రమైన అర్హత గ్రామంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో ఏవో రామసుబ్బారెడ్డి, టీవోటీ బాలక్రిష్ణ, పంచాయతి కార్యదర్శులు సుధాకర్, శ్రీనివాసులు, మండల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

రైల్వేకోడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పేదలకు నిత్యావసర వస్తువులు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బోళాశంకర్ సేవా సమితి అధ్యక్షుడు మందల నాగేంద్ర తెలిపారు. గురువారం ఎన్ఆర్ఐ మందల పాలకొండ్రాయుడు దాతృత్వంతో పట్టణానికి చెందిన వృద్ధురాలు షేక్ ఫాతిమాకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సీహెచ్ రమేష్‌బాబు, ఉత్తరాది శివకుమార్, వాసా బాబు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో ప్రతిభ చూపాలి : ఎంపీడీవో

ఓబులవారిపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో మంచి ప్రతిభ చూపాలని ఎంపీడీవో విజయరావు తెలిపారు. మండలంలోని తల్లెంవారిపల్లె గ్రామంలో మైస్కూల్ మైప్రైడ్‌లో భాగంగా జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించినట్లు ఎంపీడీవో విజయరావు తెలిపారు. విద్యార్థులు రాస్తున్న ఎస్ఏ-1 పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణం కోసం ఘర్షణ

ఇరువర్గాలను శాంతింపజేసిన పోలీసులు



సంఘటనా స్థలంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ యుగంధర్

పీలేరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఓ ఆలయ నిర్మాణం కోసం ఒకే మతానికి చెందిన రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగిన సంఘటన గురువారం పీలేరులో చోటుచేసుకుంది. పీలేరు పట్టణం ఆర్టీసీ నల్లగుట్టలో ఓం శక్తి అమ్మవారి ఆలయం నిర్మించాలని ఓ వర్గం ప్రజలు గురువారం ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కాగా ఆలయం వద్దంటూ మరో వర్గం వాటిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, ఘర్షణ చెలరేగడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అర్బన్ సీఐ యుగంధర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి శాంతింపజేశారు. రెవెన్యూ అధికారుల సాయంతో సమస్యను పరిష్కరించుకోవాలని, రెవెన్యూ అధికారుల నివేదిక వచ్చే వరకు ఆగాలని, ఆలోపు ఘర్షణలకు పాల్పడికే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఇరువర్గాలనూ హెచ్చరించారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన బీజేపీ నేతలు



మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న శోభారాణి తదితరులు

బి.కొత్తకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో బసచేసిన మంత్రి సత్యకుమార్‌ను తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల బీజేపీ నేతలు హిల్స్‌కు చేరుకుని మంత్రిని కలిశారు. పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై మంత్రికి విన్నవించుకున్నారు. బి.కొత్తకోట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ ప్రతినిధులు శోభారాణి, కిరణ్, మంజునాథరెడ్డి, ముకుంద, రమణ తదితరులు ఉన్నారు.

పసుపులేటి హరిప్రసాద్‌కు ఘనస్వాగతం



పసుపులేటి హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న జనసైనికులు

వాల్మీకిపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్‌కు గురువారం వాల్మీకిపురంలో ఘనస్వాగతం లభించింది. మదనపల్లె మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి వెళ్తున్న ఆయనకు స్థానిక జాతీయ రహదారి వద్ద జనసేన పార్టీ నేతలు స్వాగతం పలికి సత్కరించారు. జనసేన పార్టీ కార్యకర్తలంతా చిత్తశుద్ధితో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిన మధుబాబు, పీలేరు పార్టీ ఇన్‌చార్జి బెజవాడ దినేష్, వాల్మీకిపురం, కలికిరి మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు రెడ్డెప్ప, రవి, ఉపాధ్యక్షుడు దేపాని ప్రభాకర్, నేతలు పవర్ మహేష్, బాటసారి శ్రీనివాసులు, ఆషీఫ్, నాగ రాయల్, మహేష్, బాలు, వెంకటేశ్, శివకుమార్, గొడుగు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు

నిమ్మనపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వర్గవిభేదాలు వీడి ఏకతాటిపై నడిచి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ జెండాను ఎగురవేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడుతూ 17 సోమవారం స్థానిక టీవీఆర్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే షాజహాన్ బాష ఆధ్వర్యంలో గ్రామ కమిటీల్లో ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు ప్రమాణం చేయనున్నట్లు తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికలకు టీడీపీ కుటుంబ సభ్యులు ఏకతాటిపై నడిచి పార్టీని గెలిపించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలో మిగిలిన కమిటీలు వేయనున్నట్లు పదవులు రాని వారు నిరుత్సాహపడరాదన్నారు. సోమవారం జరగబోయే సమావేశానికి ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. ముఖ్యంగా టీడీపీలో మండల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజంపేట అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జి మునిరత్నం, మాజీ మండల అధ్యక్షులు రాజన్న, సర్పంచ్ రెడ్డెప్ప, నాయకులు శంకరప్ప, సుదాకర్, లక్ష్మన్న, మల్లికార్జున, రమణ, శ్రీపతి, నరేంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చీకట్లో జాతీయ రహదారి

నిర్వహణలో నిర్లక్ష్యం ● చిమ్మచీకట్లో వాహనదారుల అగచాట్లు ● 12 రోజులుగా వెలగని లైట్లు



చీకటి మాటున ఆరోగ్యవరం ఫ్లై ఓవర్ దిగువ

మదనపల్లె టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె- తిరుపతి నాలుగు లేన్ల జాతీయరహదారి చీకట్లో మగ్గుతోంది. ప్రారంభించి రెండు నెలలు తిరక్కముందే రహదారుల నిర్వహణలో లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎన్ హెచ్ 71 జాతీయ రహదారిపై ఆరోగ్యవరం గుండా వెళుతుండగా ఈ రహదారి డివైడర్ మధ్యలో 50కి పైగా విద్యుత్ దీప స్థంబాలు ఏర్పాటు చేశారు. అలాగే ఆరోగ్యవరం దిగువున ఫ్లై ఓవర్ నిర్మాణం వద్ద 19 విద్యుత్ దీప స్థంబాలు, ఫ్లై ఓవర్ కింది భాగాన ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. కాశీరావుపేట వద్ద ఫ్లైఓవర్ కింది భాగాన కూడా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. కాగా పన్నెండు రోజులుగా ఆరోగ్యవరం ఫ్లైఓవర్ వద్ద 19 విద్యుత్ దీపాలు వెలగడం లేదు. అలాగే ఆరోగ్యవరం ఊర్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు 21 దాకా వెలగడం లేదు. కాశీరావుపేట ఫ్లైఓవర్ వద్ద కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. జాతీయ రహదారిపై ప్రయాణించాలంటే టోల్‌గేట్ వద్ద ముక్కుపిండి రూ.150 వసూలు చేసే నిర్వాహకులు, రాత్రిళ్లు విద్యుత్ దీపాల నిర్వహణలో విఫలమవుతున్నారు.

గ్రామస్థాయిలో బలోపేతం చేయండి

కష్టపడిన వారికి తప్పక గుర్తింపు ఉంటుంది : మంత్రి నాదెండ్ల



మంత్రి మనోహర్‌తో మాట్లాడుతున్న పీలేరు జనసైనికులు

పీలేరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యేలతో సఖ్యతగా ఉంటూ పార్టీ బలాన్ని గ్రామస్థాయిలో మరింత పెంచేలా పని చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ దిశానిర్దేశం చేశారని పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బెజవాడ దినేశ్ తెలిపారు. మదనపల్లెలో గురువారం జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ నియోజకవర్గాల సమీక్షలో భాగంగా పీలేరు నేతలతో మంత్రి సమావేశమై కూటమి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారన్నారు. జరగ బోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి జనసైని కుడు సిద్ధం కావాలని, పార్టీ బలాన్ని గ్రామస్థా యిలో మరింత పెంచాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని మంత్రి తమకు భరోసా కల్పించినట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరినీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ డాక్టర్ హరిప్రసాద్, నేతలు కలప రవి, నియోజకవర్గ ముఖ్య నేతలు, జనసైనికులు పాల్గొన్నారు.

డీలర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి

మదనపల్లె అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని మంత్రి నాదెండ్ల మనోహర్‌కు జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధీర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మదనపల్లెకు విచ్చేసిన మంత్రిని కలిసి రేషన్ డీలర్ల సమస్యలను తీర్చాలని కోరారు. మంత్రి త్వరలో కమిషన్ పెంచుతున్నట్లు హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యలను తరువాత పరిష్కరిస్తామన్నారు.

కార్యక్రమంలో జిల్లా డీలర్ల సంఘం నేతలు గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలాలి, కోశాధికారి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్నరెడ్డెప్ప, కార్యదర్శి జయప్రకాష్, మదనపల్లె డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమాం ఖాసీం, అంజనప్ప, ప్రభాకర్, మునివెంకటప్ప, రవి, రాజన్న, చంద్ర, రమేష్, శివారెడ్డి, ఈశ్వరయ్య, రఘునాయుడు, వివిధ మండలాల రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్



కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో సమీక్షిస్తున్న జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక జడ్జి గురు అరవింద్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కోర్టు ఆవరణలో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రతి ఒక్కరూ సహక రించాలన్నారు. ముఖ్యంగా పోలీసు అధికారులు ప్రజలకు చట్టం న్యాయాల పట్ల అవగాహన కల్పిస్తూ జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునేలా చూడాలన్నారు. కక్షిదారులు కూడా క్షణికావేశంతో కేసులకు పోయి జీవితాలను దుర్భరం చేసుకోకుండా రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్‌అదాలత్ చక్కటి వేదిక అన్న విషయాన్ని గ్రహించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. సివిల్, క్రిమినల్, బ్యాంకు రుణాల కేసులు, రాజీకాదగ్గ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు కూడా పూర్తిస్థాయిలో సహకరించి అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ రమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిప్రకాష్, సెక్రటరి, ప్రసాద్, సీఐలు రాఘవరెడ్డి, అనీల్‌కుమార్, ఎస్‌ఐలు చంద్రశేఖర్, బాలకృష్ణ, న్యాయవాదులు, వివిధ బ్యాంకుల అధికారులు, మండల న్యాయసేవాధికార సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీకి రోడ్డు నిర్మించండి

● మంత్రులకు జనసేన నాయకురాలి వినతి

బి.కొత్తకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కురవోనికుంట హౌసింగ్ కాలనీకి రోడ్డు నిర్మించాలని జనసేన నాయకురాలు ప్రభావతి మంత్రులకు విన్నవించారు. మదనపల్లెలో మంత్రులు నాదెండ్లమనోహర్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి ఆమె మాట్లాడారు. వందల ఇళ్లు కేటాయించినా రోడ్డు నిర్మాణం జరగలేదని అక్కడి బాధితులు ఎందరికి, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. బి.కొత్తకోట మండలానికి చెందిన పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానంపై నేడు ఓటింగ్

బి.కొత్తకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ లక్ష్మీనరసమ్మపై ఎంపీటీసీ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం ఓటింగ్ జరగనుంది. ఈ నెల 12న జరగాల్సిన ఈ తంతు 14కు వాయిదా పడిన విషయం తెలిసిందే. మదనపల్లి సబ్‌కలెక్టర్ కల్యాణి బి.కొత్తకోట మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని హాజరైన సభ్యులతో అవిశ్వాసతీర్మానంపై చర్చిస్తారు. అనంతరం ఓటింగ్ నిర్వహిస్తారు.

మోడల్ స్కూల్లో విగ్రహాల ప్రతిష్ఠ

పెద్దతిప్పసముద్రం నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్లో గణపతి, సరస్వతిదేవి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. తిరుపతి వాస్తు పండితులు, వేదపాఠశాల ఆచార్యుల ఆధ్వర్యంలో గురువారం వేకువజామున గణపతి, సరస్వతిదేవి విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని ఆకాంక్షిస్తూ గణపతి, సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కార్యక్రమాన్ని విజయవంతంగా చేయడం మోడల్ స్కూల్‌కే ఒక చరిత్రగా పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి నిలిచిపోయారు. కార్యక్రమాన్ని విద్యార్థులు, పాఠశాల సిబ్బంది విజయవంతం చేసినందుకు ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన జిల్లా ముస్కాన్ అధికారి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ముస్కాన్ అధికారి డాక్టర్ ప్రభావతి

వాల్మీకిపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా ముస్కాన్ అధికారి డాక్టర్ ప్రభావతి వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని చిన్నపిల్లల కేర్ యూనిట్, వైద్య సేవలు, సదుపాయాల కల్పన తదితరం పరిశీలించి రికార్డు తనిఖీ చేశారు. అనంతరం స్థానిక వైద్యులతో సమీక్షించిన ఆయన వైద్యులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ప్రభుత్వాస్పత్రిలో మరింత మెరుగైన వైద్యం దిశగా కావాల్సిన సౌకర్యాల కల్పన, సమస్యలు తదితరం పరిశీలించి నివేదికలు ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కోసం నిధులు మంజూరు దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాలతి, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలవుదాం

వాల్మీకిపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో రక్తం లభించక ప్రాణాలు సైతం కోల్పోతుంటారని అలాంటి వారి కోసం ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వెల్‌విషర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యురాలు లావణ్యరెడ్డి పేర్కొన్నారు. వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 30మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శివరామ్, బ్లడ్‌బ్యాంక్ బృందం అమరావతి, అంజనాథ్, వినోద్, వినయ్, నరసింహులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి 58వ గ్రంథాలయ వారోత్సవాలు



ఎంఈఓకు ఆహ్వాన పత్రం ఇస్తున్న లైబ్రేరియన్

పీలేరు/కలకడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో శుక్రవారం నుంచి 58వ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ అమరనాథ్ తెలిపారు. ఆహ్వాన పత్రాలను ప్రముఖులకు అందజేసిన ఆయన మాట్లాడుతూ 14న ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు సంస్మరణ, 17న కవి సమ్మేళనాలు, సెమినార్‌లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడా పోటీల నిర్వహణ, 19న మహిళలకు రంగవల్లి, అల్లికల్లో పోటీలు నిర్వహిస్తామని వివరించారు. వారోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మొరుసుకాపు సంఘం నేత కోగర మద్దిరెడ్డి మృతి



బి.కొత్తకోట,నవంబరు13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొరుసు కాపు సంఘ వ్యవస్థాపకుడు, సూరపువారిపల్లి వాసి కోగర మద్దిరెడ్డి గురువారం తెల్లవారుఝామున హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు. సూరపువారిపల్లి వాసి రాజకీయంగా గుర్తింపు పొందారు. కులస్తులకు ఐక్యత కోసం ఆయన పాటు పడ్డారు. తంబళ్లపల్లి నియోజకవర్గం మొరుసు కాపుల్లో చైతన్యం కలిగించిన మద్దిరెడ్డి మృతి పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా మొరుసుకాపులు సంతాపాన్ని ప్రకటించారు. గురువారం హైదరాబాద్ ఆదర్శనగర్‌లోని ఆయన స్వగృహంలో తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యేలు ఏవీ లక్ష్మీదేవమ్మ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేతలు కాసిపల్లి సుబ్బారెడ్డి, మస్తాన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, కేశవరెడ్డి నివాళులర్పించారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందనలు

మదనపల్లె అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వన్ డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించినట్లు డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. డిపోలో నిర్వహించిన అభినందన సభలో ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూ అక్టోబరులో అధిక ఆదాయం రూ. 635లక్షలు, ఎక్కువగా కెఎంపీఎల్ అనగా 5.29 వచ్చినందుకు డిపోలోని గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బందిని అభినందించామన్నారు. నవంబరు నెలలో కూడా ఈపికే 55, ఓఆర్ 100శాతం, కేఎంపీఎల్ 5.50 తీసుకురావడానికి సూచనలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంఎఫ్ రవి, రూట్ సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్-1 పరీక్ష వాయిదా

పీలేరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించే ఎస్ఏ-1 పరీక్షను వాయిదా వేసినట్లు డీసీఈబీ కార్యదర్శి గంగాధరం పేర్కొన్నారు. వాయిదా వేసిన పరీక్షను 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు నవంబరు 17న, 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నవంబరు 20వ తేదీన నిర్వహించనున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వంద క్వింటాళ్ల ఉలవలు పంపిణీ



ఉలవలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ ప్రేమకుమారి

గుర్రంకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో గురువారం వంద కింటాళ్ల ఉలవలను పంపిణీ చేసినట్లు ఏఓ రత్నమ్మ తెలిపారు. రైతులు ఉలవ పంటను సాగు చేయడానికి ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందన్నారు. ఇందులో భాగంగా 710 మంది రైతులకు వంద కింటాళ్ల ఉలవలను అందజేసినట్లు తెలిపారు.

సబ్సిడీతో ఉలవలు పంపిణీ

కలికిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలబడటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా వుంటుందని కలికిరి మండల టీడీపీ అధ్యక్షుడు కె.ఎస్.షాబుద్దీన్ హామీ ఇచ్చారు. గుండ్లూరు రైతులకు ఉలవలు పంపిణీ చేసిన ఆయన సబ్సిడీ ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమణప్రదీప్ రెడ్డి, సర్పంచు సైపుల్లా, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్ రెడ్డి, ఎంపీఈఓ ప్రమీల, రామచంద్ర, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చెట్లు నరికేశారని ఫిర్యాదు



కురబలకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చెరువులో అక్రమంగా చెట్లను నరికేశారని ఈఓఆర్డీ అశ్వని గురువారం ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని జంగావారిపల్లె సమీపంలో అధికారపార్టీ నేత కుమ్మక్కై చెరువులోని తుమ్మ, వేపచెట్లను నెల్లూరుకు చెందిన ఓ కలప వ్యాపారికి అమ్మేశారు. ఈ విషయం వెలుగు చూడడంతో ఎంపీడీఓ కలప నిల్వ ఉన్నచోటుకి వెళ్లి తనిఖీ చేశారు. దీంతో వారిపై కేసులు నమోదు చేయాలని ఈఓఆర్డీని ఆదేశించారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

కురబలకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. గురువారం కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి మోనూ ప్రకారం భోజనాన్ని అందిస్తున్నారా అంటూ ఆయన విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో, భోజనం వడ్డించాలన్నారు. విద్యార్థులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపర చర్యలు తప్పవని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

సీఎం చంద్రబాబును కలిసిన మాజీ ఎంపీటీసీ



పెద్దతిప్పసముద్రం నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్‌బాబు గురువారం కలిశారు. పెద్దతిప్పసముద్రం మండలంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను వివరించారు. మండలంలోని నామినేటెడ్ పదవుల్లో తనకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విన్నవించినట్లు మాజీ ఎంపీటీసీ సురేష్‌బాబు పేర్కొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

నిమ్మనపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ముమ్మరంగా పారిశుధ్యం పనులు చేపడుతున్నట్లు ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. గురువారం సామకోటవారిపల్లి పంచాయతీలో చేపడుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. వర్షానికి రోడ్డు కోతకు గురవడం, తాగునీటి పైపులైన్ మరమ్మతులు వంటి పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రోజూ చెత్త సేకరణ చేసి డంపింగ్ యార్డుల్లో మాత్రమే వేయాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, విద్యుత్ దీపాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యదర్శి నాగభూషణం గ్రామస్తులు పాల్గొన్నారు.